
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
మంగళవారం 16 ఏప్రిల్ 2024

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి - 8లో..

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం - 8లో..



శివపార్వతుల కథ.. వినరండయ్యా..

- సీతారాముల కల్యాణం వేళ వివాహాల పునరుద్ధరణ
- జగదానందంగా శివసత్తుల పెళ్లి తంతు
- రాజన్న క్షేత్రానికి 'ధారణ'కు తరలి రానున్న శివపార్వతులు
- వేములవాడ రాజరాజేశ్వరస్వామి సన్నిధిలో కొనసాగుతున్న నవమి వేడుకలు
- రేపు జిల్లా వ్యాప్తంగా సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

రామయ్య పెళ్లి వేడుకలకు ఊరూవాడా సంబరం నెలకొంటుంది. పురోహితులు వేద మంత్రాలు పఠిస్తుండగా... భక్త కోటి వీక్షిస్తుండగా సీతారాముల కల్యాణ వేడుకలను వైభవంగా సాగుతాయి. రామయ్య తలంబ్రాల ఘట్టం నయనానందకరంగా నిర్వహిస్తారు. జిల్లా వ్యాప్తంగా బుధవారం అన్నీ దేవాలయాల్లో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కానీ జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించే రాములోరి పెళ్లిలో మాత్రం ధర్మ ప్రచారకులుగా ఉన్న శివపార్వతులు శివుడే పెనిమిటిగా తమ వివాహాలను పునరుద్ధరించుకునే వేడుకను చూడాల్సిందే. బుధవారం జరిగే సీతారాముల కల్యాణ వేడుకల్లో వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం సన్నిధిలో త్రిశూలం గంటల మోత.. వర్షపు జల్లుగా కురిసే తలంబ్రాలు శివసత్తుల పూనకాలతో మార్మోగుతుంది. ఆ సన్నివేశాలు మహా అద్భుతంగా చెప్పుకోవచ్చు. ఈ పెళ్లి తంతును జంగాలుగా పరిగణించే వీరశైవులు నిర్వహిస్తారు. మంగళ సూత్రంగా రుద్రాక్షను, కాళ్లకు రాగి మట్టెలు, చేతికి త్రిశూలాన్ని ఇచ్చి పెళ్లి తంతు నిర్వహిస్తారు. లోక జ్ఞానం తెలియని ఆడ పిల్లలను సైతం శివ పార్వతులుగా శివుడితో పెళ్లి చేసే తంతు 'ధారణ' పేరుతో తరతరాలుగా సాగిపోతోంది. దీనిని నివారించడానికి స్వచ్ఛంద సంస్థలు, పోలీస్ యంత్రాంగం చిన్నారులకు పెళ్లి తంతు నిర్వహించవద్దని కౌన్సెలింగ్ చేసినా ఆచారం మాత్రం ఆగడం లేదు. రాజన్న సిరిసిల్ల జిల్లా, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, కుమరంభీం, మంచిర్యాల, ఆదిలాబాద్, జనగామ, వరంగల్, నిజామాబాద్, కామారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాలతో పాటు తెలంగాణ జిల్లాల్లోని ప్రతి ప్రాంతం లోనూ శివపార్వతులుగా మారిన స్త్రీ, పురుషులు, పిల్లలు సైతం తరలివస్తారు.

● శ్రీరామనవమి రోజు పెళ్లిళ్ల పునరుద్ధరణ

శ్రీరామ నవమి రోజున ఆలయ ప్రాంగణంలో జరిగే కల్యాణం వేళ వీరు ఎక్కడ ఉన్నా వేములవాడకు వచ్చి శివుడితో వివాహం చేసుకున్నట్లు పెళ్లి తంతును నిర్వహిస్తారు. ఏటా శ్రీరామనవమి రోజు దాదాపు లక్షలాది మంది శివపార్వతులు తమ వివాహాన్ని పునరుద్ధరించుకుంటారు. సీతారాముల కల్యాణం జరుగుతుండగా జంగమయ్య ఆధ్వర్యంలో పెళ్లి తంతు సాగుతుంది. కొత్త దుస్తులు, నుదుట పెద్ద బొట్టు, బాసికాలు, తలపై జీలకర్రబెల్లం, చేతిలో త్రిశూలం ధరించి జోలె, అక్షింతలు పట్టుకొని దేవుడితో వివాహం చేసుకుంటారు. తాహతు మేరకు కట్నాలు కూడా చదివిస్తారు. పెళ్లిళ్ల చేసుకొని పిల్లాపాపలతో కుటుంబ జీవనం గడుపుతూనే శివపార్వతులుగా మారిన వారు ఉంటారు. అనారోగ్యానికి గురైనప్పుడు దేవుడికి మొక్కుగా మారిన తదనంతర కాలంలో శివపార్వతులుగా మారిపోతున్నట్లు చెబుతుంటారు. వేములవాడ దేవస్థానంలో జరిగే ఈ శివపార్వతుల పెళ్లి తంతును జంగాలుగా పరిగణింపబడే వీర శైవులు నిర్వహిస్తారు. శివ పార్వతిగా మారే వారికి జంగమయ్యనే మెడలో రాగి మంగళ సూత్రం, కాళ్లకు రాగి మట్టెలు తొడిగి స్త్రీ, పురుష భేదం లేకుండా చీర కటిస్తారు. చేతికి త్రిశూలాన్ని ఇచ్చి శివుడితో పెళ్లి జరిపిస్తారు. దీంతో అయా స్త్రీ, పురుషులు శివ పార్వతులుగా మారినట్లు భావిస్తారు. ఆ నాటి నుంచి వారు ఆదిభిక్షువుగా చెప్పుకునే శివుడి అడుగుజాడల్లో నడుస్తూ భిక్షాటన చేస్తారు. ఒక సారి శివుడితో పెళ్లి చేసుకున్న తరువాత శివుడి భార్యగానే కొనసాగుతారు. ఈ సంప్రదాయం ఎప్పటి నుంచో ఉన్నా ఇటీవల కాలంలో వీరి సంఖ్య బాగా పెరిగింది. వారి జీవనం కూడా దయ నీయంగానే ఉంటుంది. కొందరు తల్లిదండ్రులు వయస్సు వచ్చిన ఆడ పిల్లలను కూడా దేవుడి పేరుతో శివపార్వతులుగా వదలి వేస్తున్నారు. ఏళ్ల తరబడి దేవుడి పేరుతో గడిపిన స్త్రీలు వయస్సు ఉడిగాక తమ వారంటూ లేక ఆలయం మెట్ల మీదనే కాలం వెళ్ల దీస్తున్నారు.



● సాధారణ జీవితం గడుపుతూ....

ఆర్థికంగా, సామాజికంగా ఓ మెరుగైన స్థితిలో ఉన్న శివపార్వతులు తమ మామూలు జీవితంలో పెళ్లిళ్ల చేసుకొని సంసార జీవనం గడుపుతూ శివపార్వతులుగా కొనసాగుతారు. ఉన్నత స్థాయి ఉద్యోగాలు కూడా చేస్తారు. వీరు కూడా ఏటా శ్రీరామనవమికి వేములవాడ శివుడి వద్దకు వచ్చి పెళ్లిని పునరుద్ధరించుకుంటారు. రాయలసీమ, కోస్తా ప్రాంతాల్లోని దేవదాసీలు, కర్నూలు జిల్లాలోని బసివీనులు, నిజామాబాద్ జిల్లాలోని జోగినిల ఆచారాలకు దగ్గరగా ఉన్నా అందులో మహిళలకే పరిమితమవగా శివపార్వతుల ఆచారం స్త్రీ, పురుషులకు సంబంధించినదిగా ఉంటుంది. జోగిని, దేవదాసి, బసివినిల్లో లైంగిక దోపిడీ, వ్యభిచారం ఉండగా శివపార్వతుల్లో కేవలం భిక్షాటనే ఉంటుంది. శివపార్వతులు పెళ్లిళ్ల చేసుకొని పిల్లాపాపలతో కుటుంబ జీవనం గడుపుతారు. హిజ్రాలు కూడా వేడుకలకు హాజరవుతారు. శివపార్వతులు వేములవాడ ఆలయ ప్రత్యేకతను చాటుతూ ధార్మిక ప్రచారకులుగా ఎనలేని సేవలను అందిస్తున్నారు.

ఎస్సీ స్టడీ సర్కిల్‌ను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 15: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఎస్సీ విద్యార్థులు ఎస్సీ స్టడీ సర్కిల్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌ను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టడీ సర్కిల్‌లో విద్యార్థుల వసతి, భోజన సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పక్కా ప్రణాళికతో అభ్యసించి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్ కుమార్, సూపరింటెండెంట్ మొహమ్మద్ అజాం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 15: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని ఆలయ కమిటీ, శివరామకృష్ణ భజన మండలి ఆధ్వర్యంలో వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం వాసు శర్మ ఆధ్వర్యంలోని పురోహితులు కృష్ణమూర్తి శర్మ, శ్రీనివాస్‌శర్మ, నరహరిశర్మ, అంజనేయశర్మ ప్రత్యేక పూజలు చేశారు. వేద మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం గ్రామ పురవీధుల గుండా స్వామి వారి రథోత్సవాన్ని నిర్వహించారు. పందిర్ల సుజాత- సుధాకర్‌గౌడ్ దంపతులు అన్నదానం చేశారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపనోత్సవాలు



ప్రాణ ప్రతిష్ఠ వేడుకల్లో నాయకులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 15 : కాలభైరవస్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠతో పాటు ఆలయం గోపుర కలశ స్థాపనలు వైభవంగా సాగుతున్నాయి. సిరిసిల్ల పట్టణం గాంధీనగర్‌లోని భక్తాంజనేయ రుక్మిణి విఠలేశ్వర స్వామి ఆలయంలో నిర్మించిన కాలభైరవ స్వామి ఆలయంలో ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాలతోపాటు ఆలయ గోపుకలశ స్థాపనలను నాచారంగుట్టలోని శ్రీక్షేత్రానికి చెందిన పరమహంస పరివ్రాజకాచార్యులు, ముధుసూదనానంద సరస్వతి, బ్రహ్మశ్రీ రాచర్ల రఘురామశర్మ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. న్యాఫ్స్ కాబ్ ఛైర్మన్ కొండూరు రవీందర్‌రావు, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, స్థానిక కౌన్సిలర్ గుండ్లపల్లి పూర్ణచందర్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఆడెపు రవీందర్, అర్బన్ బ్యాంక్‌ఛైర్మన్ గడ్డం విఠల్, ఆలయ కమిటీ అధ్యక్షుడు వడ్ల కొండ అనందం, కార్యదర్శి కుడిక్యాల శంకర్, ఉపాధ్యక్షుడు కోడం అమర్నాథ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలి

తంగళ్లపల్లి, ఏప్రిల్ 15: రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ సూచించారు. సోమవారం తంగళ్లపల్లి మండలంలోని జిల్లెల, అంకుసాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో వసతులను పరిశీలించి, అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం తంగళ్లపల్లిలోని సప్తగిరి ఇండస్ట్రీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారులకు అడ్డుకట్ట వేసేందుకు, రైతులకు మద్దతు ధర అందించేందుకు కొనుగోలు కేంద్రాలను ముందుగానే ప్రారంభించామన్నారు. రైతులు ధాన్యాన్ని తాలు, తప్ప లేకుండా, తేమ శాతం 17 ఉండేలా చూసుకొని కేంద్రాలకు తరలించాలన్నారు. ప్రభుత్వం గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2203, గ్రేడ్ బీ రకానికి రూ.2183గా నిర్ణయించిదన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి జితేందర్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ జితేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధి పనులను ప్రారంభించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 15: ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టే అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టే అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి సౌకర్యం, తరగతి గదుల మరమ్మతు, నిరుపయోగంగా ఉన్న టాయిలెట్లను ఉపయోగంలోకి తీసుకురావడం, బాలికల కోసం అదనపు టాయిలెట్ల నిర్మాణం, తరగతి గదికి విద్యుత్ సౌకర్యం కల్పన వంటి మౌలిక వసతులను అమ్మ పాఠశాల కమిటీల ద్వారా జూన్10 వరకు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. డీఈవో రమేష్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు చొక్కి శ్రీనివాస్, ఉపాధ్యాయుడు రవీందర్ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

కల్యాణం.. కమనీయం



కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, ఏప్రిల్ 15: మండలంలోని ఫాజుల్ నగర్‌లో పెద్దమ్మతల్లి, పెద్దిరాజుల కల్యాణ మహోత్సవం సోమవారం కమనీయంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముదిరాజ్ సంఘం నాయకులు, సభ్యులు ఆది శ్రీనివాస్‌ను సన్మానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ వట్టెంల ఎంపీటీసీ రంగు వెంకటేశం, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగం ద్వారానే హక్కులు, విధులు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 15: రాజ్యాంగం ద్వారానే హక్కులు, విధులు సాధించామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా జిల్లా కోర్టులో న్యాయ సేవాధికారసంస్థ ఆధ్వర్యంలో సోమవారం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందు పరిచిన వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అంబేద్కర్ ఆశయసాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సృజన, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జోర్నా సంజీవరెడ్డి, కార్యదర్శి టి. వెంకటి, లోక్ అదాలత్ సభ్యుడు చింతోజు భాస్కర్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

28న ఏకలవ్య పాఠశాలలో ప్రవేశానికి పరీక్ష

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 15: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 28న నిర్వహించనున్న పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాజరు కావాలని కరీంనగర్ ప్రాంతీయ సమన్వకర్త వెంకన్న సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో అడ్మిట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులకు కేటాయించిన పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 15: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రాజీవ్‌నగర్‌కు చెందిన సిరిపురం లక్ష్మీనారాయణ అనే నేతన్న ఇటీవల ఉపాధి లేక ఆత్మహత్య చేసుకోవడంతో బాధిత కుటుంబాన్ని సోమవారం తెలంగాణ చేనేత ఐక్యవేదిక జిల్లా కమిటీ సభ్యులు పరామర్శించారు. లక్ష్మీనారాయణ భార్య వజ్రవ్వకు రూ.6వేల నగదును అందించారు. జిల్లా అధ్యక్షుడు మైసయ్య, రాష్ట్ర కార్యదర్శి విష్ణు, ఉపాధ్యక్షుడు దూస సత్తయ్య, ప్రధాన కార్యదర్శి ఊరగొండ రాజు, పచ్చనూరి సురేష్ పాల్గొన్నారు.

శ్రీరామనవమికి ముస్తాబు



మామిడిపల్లి ఆలయం

కోనరావుపేట, ఏప్రిల్ 15: శ్రీరామనవమి సందర్భంగా మామిడిపల్లి సీతారాముల ఆలయం ముస్తాబైంది. మంగళవారం నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు కృష్ణస్వామి తెలిపారు. ఈ నెల 17న శ్రీరామనవమి వేడుకలు ఉంటాయని పేర్కొన్నారు. 24వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. మరోవైపు శ్రీరామనవమికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఇల్లంతకుంట: మండలంలోని రామోజీపేట శ్రీరామక్షేత్రం సీతారాముల కల్యాణోత్సవానికి సిద్ధమైంది. ఈ నెల 17న ఉదయం 9 గంటలకు శ్రీరాముడి జన్మోత్సవం, అనంతరం కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు రుక్మాబట్ల సీతారామశర్మ తెలిపారు. ఆలయంలో గత 60 సంవత్సరాలుగా ఉత్సవాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఉత్సవాలకు జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులతో పాటు సిద్దిపేట, హైదరాబాద్ నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.

కేంద్రాల్లో ధాన్యం.. అన్నదాత దైన్యం

- ప్రారంభించారు.. కొనుగోళ్లు మరిచారు
- పది రోజులుగా రైతుల పడిగాపులు



కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 15: రైతులు పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరుతోంది. ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన కేంద్రాల్లో మాత్రం కాంటాలు కదలడం లేదు. కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతల పరిస్థితి దైన్యంగా మారింది. ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఇటీవల సీఎం ప్రకటించినా సంబంధిత శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు రాగట్లపల్లి, పదిర, హరిదాస్‌నగర్, వెంకటాపూర్, రాజన్నపేట, కిష్టునాయక్ తండా, బొప్పాపూర్, గొల్లపల్లి తదితర గ్రామాల్లో ఇటీవల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు ధాన్యాన్ని కేంద్రాలకు తరలించి ఆరబెట్టారు. తేమ శాతం వచ్చినా కొనుగోళ్లు లేకపోవడంతో పడిగాపులుకాస్తున్నారు.

సంచులు లేవు.. వసతులు కానరావు

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు రాగట్లపల్లి, పదిర, హరిదాస్‌నగర్, దుమాల, అల్మాస్‌పూర్, అక్కపల్లి, బుగ్గరాజేశ్వరతండా, రాజన్నపేట, కిష్టునాయక్‌తండా, బొప్పాపూర్, గొల్లపల్లి, నారాయణపూర్, బండలింగంపల్లి తదితర గ్రామాల్లో ఐకేపీ, ప్యాక్స్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రజాప్రతినిధులు, అధికారులు, నిర్వాహకులు ప్రారంభించారు. సంబంధిత శాఖ అధికారులు కొనుగోళ్లలో శ్రద్ధ చూపకపోవడంతో రైతులు పనులు వదులుకొని ధ్యానం రాసుల వద్ద నిరీక్షిస్తున్నారు. గోనె సంచులు, టార్పాలిన్లు సరఫరా కాకపోవడంతో కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందని సంబంధిత శాఖ అధికారులే పేర్కొంటున్నారు. ఆయా గ్రామాల్లోని కేంద్రాల్లో ధాన్యం పేరుకుపోయింది. కనీస వసతులు కల్పించకపోవడంతో అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి వచ్చిన సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఎదుట ఆయా గ్రామాల రైతులు తమ గోడును వెల్లబోసుకున్నారు. స్పందించిన ఆయన కొనుగోళ్ల జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని స్పష్టం చేశారు.

వేచి చూడలేక.. తక్కువ ధరకు మిల్లర్లకు విక్రయం

ఆయా గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించి వారం రోజులు గడుస్తున్నా కొనుగోళ్లు సాగకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న కొందరు రైస్ మిల్లర్లు కేంద్రాల వద్దకు చేరుకుంటున్నారు. క్వింటాల్‌కు రూ.1750 నుంచి రూ.1800 చెల్లిస్తామంటూ పేర్కొనడంతో గత్యంతరం లేక అన్నదాతలు ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. కేంద్రాలకు తీసుకొచ్చి వేచి చూడలేక తక్కువ ధరకు అమ్ముకుంటున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు, నిర్వాహకులు కొనుగోళ్లను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

వారం రోజులుగా ఎదురు చూస్తున్నా..



- మంకెన రాజిరెడ్డి, రైతు, ఎల్లారెడ్డిపేట

నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశా. వారం రోజుల కిందట కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చా. ఆరబెట్టినా కొనుగోలు చేయడం లేదు. కొనుగోలు చేస్తున్నామని ఉన్నతాధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో తూకం వేయడం లేదు. వెంటనే తూకం వేయాలి.

గోనె సంచులు రాలేదు



- పారిపెల్లి రాంరెడ్డి, రైతు, ఎల్లారెడ్డిపేట

ఐదు రోజుల కిందట ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చా. కేంద్రం ప్రారంభించినా ఇప్పటి వరకు గోనె సంచులు రాలేదు. మేఘాలు కమ్ముకుంటే ధాన్యం ఎక్కడ తడిసిపోతుందోనని పడిగాపులు కాస్తున్నా. సార్లు కొనుగోళ్లను ప్రారంభించి ధాన్యం సేకరించాలి.

జాప్యం లేకుండా చూస్తాం



- మల్లేశం, ఏపీఎం, ఐకేపీ

కొనుగోళ్లలో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటాం. రైతులు కేంద్రాలకు ఇప్పుడిప్పుడే ధాన్యం తీసుకొస్తున్నారు. తేమ శాతం రాగానే తూకం వేగవంతం చేస్తాం. రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. కేంద్రాల్లో అన్ని వసతులు కల్పిస్తున్నాం.

దొంగల బీభత్సం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 15: ఎల్లారెడ్డిపేట మండలం పదిర, అల్మాస్‌పూర్ గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. పదిరలో కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారి పక్కన ఉన్న కుంభాల మహేందర్‌రెడ్డి ఇంటి తాళం పగులకొట్టి బీరువా, సూట్‌కేస్, డ్రెసింగ్ టేబుల్‌ను ధ్వంసం చేశారు. అందులోని దుస్తులు, ఇతర వస్తువులను చిందరవందరగా పడేశారు. దేవుడి గదిలోకి వెళ్లి ఫొటోలను తొలగించారు. అరు బయట నిలిపిన స్కూటీ, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. మహేందర్‌రెడ్డి దుబాయిలో ఉండడంతో అతడి భార్య నిర్మల పిల్లలతో కలిసి ఈ నెల 10న ఇంటికి తాళం వేసి గల్ఫ్ వెళ్లింది. అల్మాస్‌పూర్‌లోని ఎల్లమ్మ ఆలయం ప్రధాన ద్వారం తాళం బద్దలుకొట్టిన దొంగలు హుండీని ధ్వంసం చేసి అందులోని రూ.10 వేల నగదు, అమ్మవారి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. హుండీని ఆలయం బయట పడేశారు. పక్కనే ఉన్న సంతోష్ హోటల్ షటర్ తాళం పగులకొట్టారు.రూ.20 వేల నగదు, విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న రూ.10 వేల విలువైన సిగరేటు ప్యాకెట్లు, శీతల పానీయాలను ఎత్తుకెళ్లారు. ఎస్‌ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోడాగ్ స్క్వాడ్, వేలిముద్రల నమూనాల సేకరణ బృందం పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాలుగు తులాల బంగారం, 15వేల నగదు అపహరణ

కోరుట్ల: పట్టణంలోని మినిట్యాంక్ బాండ్ సమీపంలోని తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. కాలనీకి చెందిన గుండ్లోజీ రాజేందర్ ఇంటికి తాళం వేసి ఆదివారం రాత్రి కటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చి చూడగా తలుపులకు వేసి ఉన్న తాళం పగుల గొట్టి ఉంది. దీంతో యజమాని రాజేందర్ ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంట్లో సామగ్రి చిందర వందరగా పడి ఉండి బీరువా తాళం పగులగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ కిరణ్ కుమార్ క్లూస్ టీం సహాయంతో తనిఖీలు నిర్వహించారు. నాలుగు తులాల బంగారు అభ రణాలతో పాటు బీరువాలో ఉన్న రూ. 15000 నగదు అపహరణకు గురైనట్లు రాజేందర్ ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య


తిరుపతి (ఫైల్)

సుల్తానాబాద్, ఏప్రిల్ 15: మండలంలోని చిన్న కలువలో జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. చిన్న కలువల గ్రామానికి చెందిన గాంట్ల తిరుపతి (40) స్థానికంగా టిఫిన్ సెంటర్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అందులో నష్టం రావడంతో ఒకరి వద్ద గుమస్తాగా పనిచేశాడు. ఆర్థిక సమస్యలతో భార్య భర్తలు తరుచూ గొడవ పడేవారు. సోమవారం కూడా గొడవ జరగడంతో తిరుపతి బయటకు వెళ్లి మద్యం సేవించి ఇంటికి రావడంతో అసలే ఆర్థిక ఇబ్బందులు ఉండగా మళ్లీ మద్యం తాగి రావడమేంటని భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన తిరుపతి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య రజిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పదేళ్ల క్రితమే మొదటి భార్యతో విడాకులు కాగా రజితను రెండో పెళ్లి చేసుకున్నారు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వడదెబ్బతో వ్యవసాయ కూలీ మృతి


రమేష్ (ఫైల్)


ముత్తారం ఏప్రిల్ 15: పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామానికి చెందిన మొగిలి రమేష్ అలియాస్ రవి(45) అనే వ్యవసాయ కూలీ వడదెబ్బతో సోమవారం మృతి చెందాడు. మానేరు అవతల గల భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం కలికోట శివారులో గల పొలం వద్దకు మోటారు వేద్దామని ఉదయం వెళ్లి మధ్యాహ్నం వరకు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా మానేరులో కిందపడి ఉన్నాడు. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడు రమేష్‌కు భార్య రాజేశ్వరి, కూతురు, కొడుకు ఉన్నారు.

నిథమ్‌లో టూరిజం కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 15: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్) గచ్చిబౌలి, హైదరాబాద్‌లో టూరిజం కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటకశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆమోదిత నిథమ్ కళాశాలలో ఇంటర్, డిగ్రీలో బీఎస్సీ, బీబీఏ, ఎంబీఏ అడ్మిషన్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇందులో టూరిజం, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలతో పాటు దేశంలోని హాస్పిటాలిటీ ఇండస్ట్రీలో అనేక అవకాశాలు లభిస్తాయన్నారు. జాతీయస్థాయి విద్యావిధానంతో నిథమ్‌లో ఉన్నత ప్రమాణాలతో కోర్సులు అందిస్తుందని, అడ్మిషన్, ఇతర వివరాలకు జిల్లా పర్యాటకశాఖ కార్యాలయం, కరీంనగర్‌లోగానీ జిల్లా పర్యాటకశాఖ అధికారి 94408 16070లో సంప్రదించాలని సూచించారు.

రూ.7,400 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 15: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,400 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 51 మంది రైతులు 644 క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు 18 క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,400, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.





భక్తోత్సవం ప్రారంభం

అశ్వ వాహనంపై స్వామివారల విహారం


స్వామివారి ఉత్సవమూర్తులు

వేములవాడ, ఏప్రిల్ 15 : వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రంలో శ్రీరామ భక్తోత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. శ్రీరామ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు నుంచి తొమ్మిదో రోజు వరకు మూడు రోజులపాటు నిర్వహించే శ్రీరామ భక్తోత్సవంలో తొలిరోజు ఉదయం ఆలయ స్థానా చార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు, వేదపండితులు స్వస్తిపుణ్యాః వచనము, గౌరీపూజ, పంచగవ్య మిశ్రణం, ఋత్విక్ వరుణము, యాగశాల ప్రవేశం, మండపారాధన నిర్వ హించారు. అర్చకుల కు వరుణి అందజేశారు. అంతకుముందు రాజరాజేశ్వరస్వామికి మహన్యాస పూర్వక ఏకా దశ రుద్రాభిషేకం, శ్రీసీతారామచంద్ర స్వామివారికి ఉపనిషత్ ద్వారా అభిషేకం చేశారు. పరివార, అను బంధ దేవతలకు అభిషేకములు నిర్వహించారు. రాత్రి పార్వతీరాజ రాజేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీఅనంత పద్మనాభస్వామి వారలను అశ్వ వాహనంపై ఊరేగించారు. ఉత్సవాలలో భాగంగా ఈ నెల 17వ తేదీ బుధవారం శ్రీరామనవమి సందర్భంగా సీతారామ చంద్రస్వామి వారల దివ్య కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆలయ చైర్మన్ అతిథిగృహం ముందుభాగంలో వేదికతోపాటు భారీ ఏర్పాట్లు చేపట్టారు.


అర్చకులకు వరుణి అందజేస్తున్న ఆలయ స్థానాచార్యులు


అశ్వవాహనంపై విహరిస్తున్న స్వామివారు

భక్తజన సంద్రంగా రాజన్న క్షేత్రం

వేములవాడ, ఏప్రిల్ 15 : వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం సోమవారం భక్త జనసంద్రంగా మారింది. శ్రీరామ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తమ ఇష్టదైవమైన రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. కళాభవన్‌లో స్వామివారి నిత్య కల్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రిపుర సుందరి దేవి ఆలయంలో కుంకుమ పూజ తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. అనుబంధాలయమైన బద్దిపోచమ్మ దేవాలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. పెద్దసంఖ్యలో భక్తులు బద్ది పోచమ్మవారిని దర్శించుకొని బోనం మొక్కు చెల్లించుకున్నారు. భీమేశ్వరాలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.


బారులుదీరిన భక్తులు

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు
ముగ్గురికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, ఏప్రిల్ 15: శంకరపట్నం మండలం కేశవపట్నం శివారులోని హెచ్‌పీ గ్యాస్ గోదాం సమీపంలో కరీంనగర్-వరంగల్ జాతీయ రహ దారిపై సోమవారం ఉదయం కారు అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన ముద్రవేణి ప్రభాకర్ కారులో అతని బంధువు గోనెల సుదర్శన్, గోనెల శ్రీవర్షినిలు మానకొండూర్ మండలం కొండపలకలలో దశదిన కార్యక్రమానికి వెళ్లి సోమవారం తెల్లవారు జామున తిరిగి రాంపూర్‌కు వస్తున్నారు. ఈ క్రమంలోనే కేశవపట్నం శివారులో కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. ఈఎంటీ సతీష్‌రెడ్డి, పైలట్ గోపికృష్ణలు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సుదర్శన్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 15: మండలంలోని తుమ్మనపల్లి గ్రామ శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాల య్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలం వెన్నంపల్లికి చెందిన శ్రీకాంత్, శంకరపట్నం మండలం చింతగుట్టకు చెందిన మేఘన ద్విచక్ర వాహనంపై కరీంనగర్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలోనే ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టినట్లు తెలిపారు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనం ద్వారా వరంగల్ ఎంజీఎంకు తరలించినట్లు తెలిపారు.



20 నుంచి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాలు

కరీంనగర్, గోదావరిఖని, సిరిసిల్లలో శిబిరాల నిర్వహణ

18వ తేదీలోపు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

కేడీసీఏ అధ్యక్షుడు వి.ఆగమ్‌రావు



మాట్లాడుతున్న కేడీసీఏ అధ్యక్షుడు ఆగమ్‌రావు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్15: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అనుబంధ సంఘం అయిన కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్(కేడీసీఏ) ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి వేసవి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామని కేడీసీఏ అధ్యక్షుడు వి.ఆగమ్‌రావు తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రికెట్ శిక్షణ శిబిరాలను కరీంనగర్, గోదావరిఖని, సిరిసిల్లలో నిర్వహిస్తున్నామని తెలిపారు. అండర్-14, 16, 19, 23 వయస్సు విభాగాలలో బాలబాలికలకు ఈ ఉచిత శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయా శిక్షణ కేంద్రాల్లో నిష్ణాతులైన కోచ్‌లు, ట్రైనర్లను నియమిస్తున్నామని చెప్పారు. అలాగే క్రీడాకరుల కోసం క్రికెట్ నెట్లతో పాటు జంబోకిట్లు, అందుబాటులో ఉంచామన్నారు.

ఈ శిక్షణ శిబిరాలలో ప్రతిభ చాటే క్రీడాకారులను హెచ్‌సీఏ, కేడీసీఏల ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా, రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని కల్పిస్తామని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6గంటల నుంచి 9 వరకు ఈ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఆరు సంవత్సరాల తరువాత ప్రతిష్ఠాత్మ కంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణ శిబిరాలలో పాల్గొనే సదావకాశాన్ని క్రీడా కారులు వినియోగించుకోవాలన్నారు. ఆసక్తి గల బాల బాలికలు తమ పేర్లను www.hycricket.org వెబ్‌సైట్‌లో ఈనెల 16 నుంచి 18 తేదీ సాయంత్రం 6 గంటల వరకు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 20న ప్రారంభమయ్యే ఉచిత శిక్షణ శిబిరాలు మే నెల 20వరకు నెల రోజుల పాటు కొనసాగుతాయని తెలిపారు. శిబిరాల్లో పాల్గొనే క్రీడాకారులకు హెచ్‌సీఏ సహకారంతో ఉదయం పౌష్టికాహారాన్ని అందించనున్నామన్నారు. అలాగే త్వరలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో కెపిఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా క్రికెట్ సంఘం బాధ్యులు ఉచిత క్రికెట్ శిబిరాల ప్రచార బ్రోచర్‌ను ఆవిష్కరించారు. క్రీడాకారులు తమ సందేహాలను నివృత్తికి 80087 29397 నంబరులో సంప్రదించాలని తెలిపారు. ఈ సమావేశంలో కేడీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం మురళీధర్‌రావు, ఉపాధ్య క్షుడు పి మనోహర్‌రావు, కె మహేందర్‌గౌడ్, క్రికెట్ కోచ్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎండోమెంట్ కమిషనర్ ఆదేశాలపై నిర్లక్ష్యం

● ఇరవై రోజుల క్రితం చర్యలకు ఆదేశం ● ఎట్టకేలకు కొండగట్టు ఉద్యోగులకు మెమోలు

మల్యాల, ఏప్రిల్ 15: దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాలపై గత ఇరవై రోజులుగా స్తబ్దుగా ఉన్న అధికారులు కదిలారు. కొండగట్టు అంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో కొన్నాళ్ల క్రితం విధులు నిర్వహించిన ఏఈవో బుద్ది శ్రీనివాస్‌తో పాటు పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్‌కు సోమవా రం ఈవో చంద్రశేఖర్ మెమొలు జారీ చేశారు. ఇక్కడి సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ చారీ దేవస్థానానికి సంబంధించిన టెండర్ల సొమ్ములు దాదాపు రూ.52లక్షలు దుర్వినియోగం చేశారనే దానిపై అప్పట్లోనే అప్పటి ఈవో వెంకటేష్ శ్రీనివాస్‌చారీతో పాటు పర్యవేక్షణ అధికారులకు చార్జీ మెమోలు అందించారు. అనంతరం శ్రీనివాస్ చారీని సస్పెండ్ చేయడంతో పాటు పోలీస్‌స్టేషన్‌లోనూ కేసు నమోదు చేశారు. కొన్నాళ్లకు ఏడీసీ జ్యోతి సొమ్ముల దుర్వినియోగంపై విచారణ జరిపిన అనంతరం పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యం వహించినందుకు గాను గత నెల 23న ఈవోపై దేవాదాయశాఖ క మిషనర్ సస్పెన్షన్ వేటు వేశారు. ఈవోపై చర్యలు తీసుకుంటూనే సదరు పర్యవేక్షణ అధికారుల నిర్లక్ష్యంపై కూడా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే ఇక్కడి అధికారులు కమిషనర్ ఆదేశాలపై ఇరవై రోజులు గడిచినప్పటికీ కమిషనర్ ఆదేశాలపై ముందుకు కదలకపోగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎట్టకేలకు సోమవారం ముగ్గురు అధికారులకు మెమోలు అందించారు. అంజన్న సొమ్ముల దుర్వినియోగంపై గత పదేళ్ల రికార్డుల తనిఖీలు కొనసాగుతున్నట్లు తెలుస్తుంది.

జమ్మికుంటలో మద్యం పట్టివేత

జమ్మికుంట, ఏప్రిల్ 15: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని హనుమండ్లపల్లిలో ఓ వ్యక్తి అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను సోమవారం పోలీస్‌లు పట్టుకున్నారు. ఓ వ్యక్తి తన ఇంట్లో మద్యం విక్రయిస్తున్నాడని సమాచారం అందుకున్న బ్లూకోర్టు సిబ్బంది తనిఖీలు చేపట్టారు. రూ.2,280 విలువ గల మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు

ఇల్లందకుంట, ఏప్రిల్ 15: మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన ఓ బెల్ట్ షాపు యజ మానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజకుమార్ సోమవారం తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి అక్రమంగా మద్యం అమ్ముతుండగా అతన్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రూ. 30వేల జరిమానా విధించినట్లు తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఏడుగురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 15: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఏడుగురు వాహనదారులకు జైలు శిక్ష, జరిమానా పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తనిఖీలలో పట్టుబడిన 21 మంది వాహనదారులను సోమవారం కరీంనగర్ మున్సిఫ్ కోర్టులో హాజరుపరచగా ముగ్గురు వాహనదారులకు ఐదు రోజుల జైలుశిక్ష, నలుగురు వాహనదారులకు మూడు రోజుల జైలు శిక్ష, మొత్తం రూ. 12 వేల జరిమానా విధించారని తెలిపారు. మిగతా 14 మంది వాహనదారులకు 23, 500 రూపాయలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 15: మండలంలోని మల్యాల గ్రామ సమీపంలో సోమవారం లారీ(టీఎస్ 24 7272)లో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా ఎస్సై ఓంకార్ యాదవ్ పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అంబాల రవి అక్రమంగా ఇసుక వ్యాపారం నిర్వహించేవాడని, అందులో భాగంగానే అర్ధరాత్రి సమయంలో గుంపుల గ్రామ సమీపంలోని మానేరు నది వద్దకు వెళ్లి అక్కడ జేజా శ్రీనివాస్ జేసీబీ సహాయంతో ఇసుకను లోడ్ చేసి, లోడింగ్ పూర్తయిన తర్వాత అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. డ్రైవర్‌తోపాటు లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

వేములవాడ, ఏప్రిల్ 15 : వేములవాడ పట్టణంలోని న్యూ అర్బన్ కాలనీ చెందిన ఎండీ షారుక్ (26) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఫాజుల్ నగర్‌కు చెందిన షారుక్ కుటుంబం కొంతకాలంగా వేములవాడలోని అర్బన్ కాలనీలో నివాసం ఉంటోంది. ఆదివారం రాత్రి శాత్రాజుపల్లి నుంచి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్న క్రమంలో సాయిరక్ష సమీపంలో రహదారి మరమ్మతు పనులు జరుగుతున్న ప్రాంతంలో ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీ కొట్టాడు. తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. దీంతో చికిత్స కోసం హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, 11 నెలల వయస్సు ఉన్న కూతురు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్ తెలిపారు.

ట్రాక్టర్ చోరీలకు పాల్పడుతున్న నిందితుల పట్టివేత

● ముగ్గురితో పాటు బాలుడి అరెస్ట్ ● ట్రాక్టర్, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్ల స్వాధీనం


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

మల్యాల, ఏప్రిల్ 15: వ్యవసాయంతో వస్తున్న ఆదాయం సరిపోవడం లేదని ఎక్కువగా సంపాదించాలనే అత్యాశతో ట్రాక్టర్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులతో పాటు ఓ బాలుడిని పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని రాజారంలో ఇటీవల ట్రాక్టర్ ఎత్తుకెళ్లిన దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా కడెం మండలం అల్లంపల్లికి చెందిన సింగారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డితో పాటు మరో బాలుడు, ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం షామ్‌నగర్‌కు చెందిన పెంబి రాజులు వ్యవసాయం, కూలీపనులతో వచ్చే ఆదాయం సరిపోక ట్రాక్టర్‌ల దొంగతనాలకు పాల్పడుతూ ఉన్నారు. ఇందులో భాగంగా కొన్నాళ్ల క్రితం చంద్రశేఖర్‌రెడ్డి, రాజు గుడిహత్నూర్‌లో ట్రాక్టర్ దొంగతనం చేయడంతో అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. మళ్లీ దొంగతనాలకు జగిత్యాల ప్రాంతానికి వచ్చిన నలుగురు రెక్కీ నిర్వహిస్తూ మల్యాల మండలం రాజారం శివారులో గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి ఇంటి ముందు నిలిపి ఉన్న రెండు ట్రాక్టర్లలో ఒక్క దాన్ని ఎత్తుకెళ్లారు. ఆ ట్రాక్టర్‌ను ఎవరూ గుర్తు పట్టకూడదని కొండగట్టు ప్రాంతంలోని గుట్టలలో రంగులు మార్చి సోమవారం తమ గ్రామానికి తీసుకెళుతుండగా ముగ్గురు నిందితులతో పాటు బాల నేరస్థుడిని కొండగట్టు వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో వారి వద్ద ట్రాక్టర్, ట్రాలీ, ద్విచక్ర వాహనం, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కోర్టులో హాజరుపరచినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో మల్యాల సీఐ నీలం రవి, ఎస్సైలు అబ్దుల్‌రహీం, కుమారస్వామి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న అధికారులు

సిరిసిల్ల క్రైం/వేములవాడ, ఏప్రిల్ 15 : అగ్ని ప్రమాదాల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని వేములవాడ అగ్నిమాపక శాఖ అధికారి కమలాకర్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం కోరుట్ల బస్టాండ్, తిప్పాపూర్ బస్టాండ్‌లో ప్రజలకు ప్రమాదాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. ముంబై ఓడరేవులో జరిగిన అగ్ని ప్రమాదాన్ని అగ్నిమాపక దినోత్సవంగా జరుపుతూ ప్రమాదాల్లో కోల్పోయిన వారికి నివాళులర్పిస్తామని అన్నారు. ఇందులో భాగంగా వారం రోజులపాటు ప్రజలు ఉండే షాపింగ్ మాల్స్, అపార్ట్‌మెంట్లు, బహిరంగ ప్రదేశాలు, ఆస్పత్రులలో ప్రమాదాలపై నివారణ అవగాహన కల్పిస్తామని చెప్పారు. వేసవిలో జరిగే ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది రాజేంద్రప్రసాద్, మునీంద్ర చారి, సురేష్, యాదయ్య, శంకర్, రాజేశం, రాజశేఖర్ పాల్గొన్నారు.

● అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సిరిసిల్ల పట్టణంలోని నేతన్నచౌక్, అంబేడ్కర్‌చౌరస్తా వద్ద సోమ వారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిం చారు. ఇన్‌చార్జి ఫైర్ అధికారి టి. నర్సింహాచారి, లీడింగ్ ఫైర్‌మెన్ పి.మహిపాల్, ఆపరేటర్ ఎల్. నవీన్‌కుమార్, ఫైర్‌మెన్ ఎస్.సాగర్‌రెడ్డి, ఎ.నాగరాజు, జి.ప్రవీణ్ కుమార్, ఎస్‌డీ సాబీర్, వి. రాజు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: వేములవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో అగ్నిమాక వారోత్సవాల సందర్భంగా సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్ఎఫ్‌వో కమలాకర్, రాజేంద్రప్రసాద్, మునింద్రచారీ, సురేష్, యాదయ్య, శంకర్, రాజశం, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన నాయకులు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 15 : రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సోమవారం సిరిసిల్ల పద్మశాలి సంఘం భవన నిర్మాణ హడక్ కమిటీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రిని కమిటీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ సన్మానించారు. అనంతరం సిరిసిల్లలో పద్మశాలి సంఘం భవన నిర్మాణం బీసీ సంక్షేమ శాఖ ద్వారా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పద్మశాలి సంఘం భవన నిర్మాణం కోసం బీసీ సంక్షేమ శాఖ నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. పద్మశాలి సంఘం భవన నిర్మాణ హడక్ కమిటీ సభ్యులు గాజుల బాలయ్య, గోలి వెంకటరమణ, బొల్లి రామ్మోహన్, మంచె శ్రీనివాస్, దార్నం లక్ష్మీనారాయణ, గోవిందు రవి, మండల సత్యం, ఎల్దండి దేవదాస్ పాల్గొన్నారు.


మంత్రిని సన్మానిస్తున్న సభ్యులు

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

కోనరావుపేట, ఏప్రిల్ 15: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట ఎంపీటీసీ దేవరకొండ చారి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రమేష్‌రెడ్డితోపాటు 50 మంది బీఆర్ఎస్ నుంచి సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను చూసి పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో కుటుంబ సభ్యులుగా కలిసి ఉంటారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. కేంద్రంలో 14 మంది ప్రధాన మంత్రులు చేసిన అప్పు ఒక్కటైతే పది సంవత్సరాల మోదీ ప్రభుత్వ పాలనలో చేసిన అప్పు ఒక ఎత్తు అవుతుందన్నారు. గతంలో కాంగ్రెస్ నుంచి వెళ్లిన నాయకులు మళ్లీ పార్టీలో చేరుతున్నారన్నారు. వీరి ద్వారా పార్టీ మరింత బలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జగన్మోహన్ రెడ్డి, కచ్చకాయలు ఎల్లయ్య, చందనగిరి గోపాల్, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, కాంగ్రెస్ నాయకులు తాళ్లపల్లి ప్రభాకర్, పల్లె రవీందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కష్టపడి పని చేసినా గుర్తింపు లేదు

బీఆర్ఎస్‌లో కష్టపడి పని చేసిన గుర్తింపు లేదని బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరినట్లు కోనరావుపేట ఎంపీటీసీ దేవర కొండ చారి, గ్రామ అధ్యక్షుడు కర్రెడ్ల రమేష్ రెడ్డి అన్నారు. సోమవారం బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను చూసి పార్టీలో చేరామన్నారు. కాంగ్రెస్ లో చేరిన వారిలో తిరుపతి, నవీన్, శ్రీనివాస్, యాస శంకర్ తదితరులు ఉన్నారు.

బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యం

వేములవాడ రూరల్ : బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. నూకలమర్రికి చెందిన పలుపార్టీల, సంఘాల నాయకులు 200 మంది ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోపే పలు గ్యారెంటీలను అమలు చేశామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, వట్టెంల ఎంపీటీసీ రంగు వెంకటేశం, నాయకులు బొడ్డు రాములు, రోమాల ప్రవీణ్, యాదవ సంఘం నాయకులు మెడిదల శ్రీనివాస్, పరుశరాములు, పోట్ల మధు, ఏసుక్రీస్తు శిష్యబృందం బస రాజు, రజక సంఘం నాయకులు కొత్తకొండ రమేష్, దేవయ్య హమాలి సంఘం నాయకులు సుంకపాక శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించుదాం

రుద్రంగి: దేశంలో ప్రజా వ్యతిరేక విధనాలు అవలంబి స్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని, ప్రజా ప్రభుత్వ ఏర్పాటుకు ప్రతీ ఒక్కరు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఏమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో సోమవారం ప్రభుత్వ విప్ ఆది శీనివాస్ సమక్షంలో జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ వద్ద నారాయణతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాల బీఆర్ఎస్, బీజేపీ పాలనలో రాష్ట్రానికి, దేశానికి ఒరిగిందేమీ లేదన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో వేములవాడ నియోజకవర్గం నుంచి భారీ మోజార్టీ కోసం ప్రతీ ఒక్కరు సైనికుడిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూం జలపతి, గ్రామశాఖ అధ్యక్షులు సామ మోహన్‌రెడ్డి, తర్రె మనోహర్, చెలుకల తిరుపతి, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, కెసిరెడ్డి నర్సరెడ్డి, మాడిశెట్టి అభిలాష్, పల్లి గంగాధర్, కోమిరె శంకర్, ఇప్ప మహేష్, గడ్డం స్వామి, తర్రె లింగం, ద్యావల రవి, స్వర్గం పరందామ్, సూర యాదయ్య, దసారి గంగారాజం, గంధం మనోజ్, దర్న మల్లేశం, ఆర్మూర్ నర్సయ్య, పడాల శ్రీనివాస్, పూదరి మహిపాల్, ఎర్రం అరవింద్ తదితరులు పాల్గొన్నారు.


జడ్పీటీసీని కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఆది శ్రీనివాస్

పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

తంగళ్లపల్లి, ఏప్రిల్ 15: తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహ పున ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఉత్సవాల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. ఆది శ్రీనివాస్‌ను, జడ్పీటీసీ పూర్మాణి మంజుల లింగారెడ్డిని సన్మానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్, మహిళా అధ్యక్షురాలు హారిక రెడ్డి, జిల్లా నాయకులు వైద్య శివప్రసాద్, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

వీర్నపల్లి, ఏప్రిల్ 15 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తహసీల్దార్ ఉమారాణి అన్నారు. వీర్నపల్లి మండలం బాబాయ్ చెరువు తండా, బావ్‌సింగ్‌నాయక్ తండా, భూక్యతండా, మద్దిమల్ల, బంజేరు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను సోమవారం తనిఖీ చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ఎల్సాని ప్రవీణ్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

ఎన్‌హెచ్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 15 : రాష్ట్రంలో ఉన్న ఎన్‌హెచ్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని ఎన్‌హెచ్‌ఎం ఆల్ క్యాడర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో జిల్లాలోని ఎన్‌హెచ్‌ఎంలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎన్‌హెచ్‌ఎంలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు, జగిత్యాల జిల్లా నాయకుడు వెన్న మహేష్, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎన్‌హెచ్‌ఎం సంఘం నాయకురాలు రాణి పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

ఇల్లంతకుంట, ఏప్రిల్ 15: దళిత బహుజన సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 25న మండల కేంద్రంలో నిర్వహించనున్న మహనీయుల జయంత్యోత్సవ సభ కరపత్రాన్ని సోమవారం నాయకులు ఆవిష్కరించారు. అంబేద్కర్, జగ్జీవన్‌రాం, జ్యోతిరావుపూలేల జయంతి ఘనంగా నిర్వహించుకున్నామని వారు తెలిపారు. సభకు కులవివక్ష పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు హాజరుకానున్నట్లు చెప్పారు.నాయకులు సావనపెల్లి రాకేష్, గన్నారం నర్సయ్య, పసుల బాలరాజు, మంద అనీల్, సామ నర్సింహ్మారెడ్డి, లింగన్న పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలవాలని తప్పుడు ప్రచారం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 15: బీజేపీ తప్పుడు ప్రచారంతో పార్లమెంట్ ఎన్నికల్లో గెలవాలని చూస్తోందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం విలే కరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను నెరవే ర్చలేదని పేర్కొంటూ కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ కరపత్రా లను పంచుతూ తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలలో ఐదు అమలు చేసిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సామాన్యులకు ఒరగబె ట్టిందేమీ లేదన్నారు. ఉద్యోగాలు, జన్‌ధన్ ఖాతాలో రూ.15 లక్షలు ఏమయ్యాయని ప్రశ్నించారు. నాయకులు లక్ష్మారెడ్డి, లింగాగౌడ్, బుచ్చాగౌడ్, బాబు, రాములు, రాజు, దేవయ్య, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించకుంటే సమ్మె

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 15 : సిరిసిల్ల మున్సిపల్‌లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిన పారిశుధ్యం, ఇతర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించకుంటే సమ్మెకు వెళ్తామని సీఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోడం రమణ అన్నారు. సోమవారం సీఐటీయూ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో కార్మికులు, నాయకులు మున్సిపల్ కమిషనర్ లావణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ సిబ్బందికి రావల్సిన ఆరు నెలల పీఆర్‌సీ ఏరియర్స్ బకాయిలు చెల్లించాలన్నారు. మున్సిపల్ వర్కర్ యూనియన్ అధ్యక్షుడు కాసారపు శంకర్, కార్మికులు బాలయ్య, రాజయ్య, నరేష్‌లు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 15: ఆపదలో ఉన్న వారికి 48 సార్లు రక్తదానం చేసి తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో నంది అవార్డు అందుకున్న ఎల్లారె డ్డిపేట మండల కేంద్రానికి చెందిన యువకుడు వంగ గిరిధర్‌రెడ్డిని మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు సోమవారం సన్మా నించారు. నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, లింగాగౌడ్, బాల్‌రెడ్డి, బుచ్చాగౌడ్, రాజు, శ్రీపాల్‌రెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద యువతి వివాహానికి దాతల సాయం

రుద్రంగి, ఏప్రిల్ 15: అనాథ యువతి ఎల్ల ప్రమీల వివాహం సోమవారం రుద్రంగి మండల కేంద్రంలోని బుగ్గ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించారు. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన ఎల్ల ప్రమీల తల్లిదండ్రులు గతేడాది అనారోగ్యంతో మృతి చెందారు. ప్రమీలా వివాహానికి దాతలు ముందుకొచ్చారు. సోమవారం ప్రమీలా- నరేష్ వివాహనికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు ఎంపీపీ గంగం స్వరూపరాణి మహేష్ వధూవరులను ఆశీర్వదించి రూ.5 వేలు, అందించారు. ప్రజాప్రతినిదులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

కోనరావుపేట, ఏప్రిల్ 15 : ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిం చాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి అన్నారు. కోనరావుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాల్లో వెంటనే ధాన్యం సేకరించాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

చందుర్తి, ఏప్రిల్ 15: చందుర్తి మండలం మూడపల్లిలో సోమవారం బైక్ అదుపుతప్పి యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. వేములవాడ రూరల్ మండలం నాగయ్యపల్లికి చెందిన చెట్టిపల్లి సాయితోపాటు మారుతి అనే యువకుడు బైక్‌పై చందుర్తి నుంచి నాగయ్యపల్లికి వెళ్తున్నారు. మూడపెల్లి వద్ద బైక్ అదుపుతప్పి కిలోమీటర్లను సూచించే పర్లాంగ్ రాయిని ఢీకొన్నాడు. సాయికి తీవ్ర గాయాలవగా, మారుతికి స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. సాయిని చికిత్స నిమిత్తం 108లో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 15: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్పంచులను ఆదుకోవాలని ఇల్లంత కుంట సర్పంచుల ఫోరం మాజీ అధ్య క్షుడు చల్ల నారాయణ అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మా ట్లాడారు. గ్రామాలను అభివృద్ధి చేసు కోవాలన్న ఆపేక్షతో గత ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం అభివృద్ధి పనుల ను చేపట్టామన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో ఈజీఎస్ డబ్బులను చెల్లించారని, ఇల్లంతకుంట మండలాన్ని మాత్రం పక్కన బెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. గత మంత్రి కేటీఆర్‌ను కలెక్టర్‌లో కలసి సమస్యలను విన్నవిస్తే తిరస్కరించారన్నారు. రెండు సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వ రాష్ట్ర వ్యాప్తంగా స్టేట్ ఫైనాన్స్ నిధులను ఇవ్వలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం వేసిన ఫిఫ్టీన్ ఫైనాన్స్ నిధులను కూడా దారి మళ్లించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్‌ల ఉసురు తలిగే బీఆర్ఎస్ ప్రభుత్వం పోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ బాధలను అర్థం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఫోరం నాయకులు గట్ల మల్లారెడ్డి, ముల్కం అమర్, ముస్కు మల్లయ్య, కాశం శ్రీనివాస్‌రెడ్డి, కూనబోయిన బాలరాజు, ఎర్రవెల్లి మల్లయ్య, తిరుపతిరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించాలి

గంభీరావుపేట, ఏప్రిల్ 15: అంగన్‌వాడీ కేంద్రాలను సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎంపీడీవో రాజేందర్ అన్నారు. గంభీరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వంగ కరుణ అధ్యక్షతన సోమవారం సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ సెంటర్ల ఆధ్వర్యంలో నిర్వహించే పోషణ్ పక్వాడ్‌పై కొన్ని చోట్ల గ్రామ ప్రత్యేక అధికారులకు సమాచారం ఇవ్వక పోవడంపై ఎంపీడీవో ఫైవిధంగా స్పందించారు. క్రమం తప్పకుండా అంగన్‌వాడీ సెంటర్లను సూపర్ వైజర్లు విజిట్ చేయాలని, సమస్యలు, సౌకర్యాలు తెలుస్తాయని అన్నారు. 200 యూనిట్ల లోపు రీడింగ్ తిరిగినా కరంటు బిలుల్లు వస్తున్నాయని కొందరు సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. దీనిపై ఎంపీడీవో రాజేందర్ మాట్లాడుతూ మండల పరిధిలో గృహజ్యోతి పథ కంకు సంభందించి వెయ్యికి పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, ఎన్నికల కోడ్ ఉన్నందున కొంత ఆలస్యమవు తోందని అన్నారు. మిషన్ భగీరథ నీరు సరిగా రావడం లేదని, అధికారులు పట్టించుకోవడం లేదని కొందరు సభ్యులు వాపోయారు. మండల పరిధిలో కొన్ని చోట్ల విద్యుత్ లూజ్ లైన్లు ఉన్నాయని, లూజ్ లైన్ల ద్వార ఇబ్బదులు ఏర్పడుతున్నా యని, సరి చేయాలని మరి కొందరు సభ్యులు కోరారు. అనంతరం ఎంపీపీ వంగ కరుణ మాట్లాడుతూ సమన్వ యంతో పని చేస్తు సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాల న్నారు. వైస్ ఎంపీపీ దోసల లత, జడ్పీ కో ఆప్షన్ హైమద్, ఎంపీడీవో రాజేందర్, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ వంగ కరుణ

గంజాయి తరలిస్తున్న వ్యక్తుల పట్టివేత?

ఇల్లంతకుట, ఏప్రిల్ 15: మండలకేంద్రం మీదుగా గం జాయిని తరలిస్తున్న వ్యక్తులను పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. స్థానికుల వివరాల ప్రకారం.. మహరాజుల కాలనీ సమీపంలో ఎస్సై రాజుగౌడ్ ఆధ్వర్యంలో సోమ వారం పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరు అనుమానాస్పదంగా కనిపిచ డంతో తనిఖీ చేయగా గంజాయి లభించినట్లు తెలిసింది.

సంక్షిప్తంగా..

● ఇల్లంతకుంట: మండలంలోని పెద్దలింగాపూర్ అంగన్‌వాడీ కేంద్రానికి మాజీ సర్పంచ్ గొడిశెల జితేందర్‌గౌడ్ సోమవారం రూ.5వేల విలువైన సామాగ్రిని అందించారు.

● ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌లో ఇటీవల ముంజలు కోసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడి మృతి చెందిన భీమరి దేవయ్య కుటుం బాన్ని కాంగ్రెస్ నాయకులు సోమవారం పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. నాయకులు నర్సయ్య, లక్ష్మా రెడ్డి, రాజేందర్, బాల్‌రెడ్డి, ఆంజనేయులు, దేవేందర్, భీమయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 15: జిల్లాలోని గ్రామపంచాయతీ కార్మి కుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని, ప్రతినెల 5వ తేదీలోగా వేతనాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం సీఐటీ యూ గ్రామపపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. జిల్లా పంచాయితీ అధికారితో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వేతనాలు నెల తరబడి పెండింగ్‌లో ఉండడంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఒక్కో గ్రామంలో మూడు నెలలనుంచి 10 నెలల వరకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ నాయకులు లింగంపల్లి కృష్ణవేణి, బుర్ర శ్రీనివాస్, వర్కేలు మల్లయ్య నారాపురం నర్సయ్య, అంజయ్య గంగరాజు, శేఖర్, అనిల్, మహేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌కు వచ్చిన నాయకులు

చెట్లు దగ్ధం

కోనరావుపేట ఏప్రిల్ 15: కోనరావుపేట మండలం కనగర్తి గ్రామ శివారులో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని సోమవారం పలు చెట్లతోపాటు చింత చెట్లు దగ్ధం అయ్యాయి గ్రామానికి చెందిన ఉప్పుల రాజుకు చెందిన చింత చెట్లు ప్రమాదవశాత్తు అంటుకున్నాయి. గమనించిన రైతులు వేము లవాడలోని ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సిబ్బం ది చేరుకొని మంటలను ఆర్పి వేయడంతో ప్రమాదం తప్పింది. 50 చింత చెట్లు దగ్ధమైనట్లు బాధితుడు తెలిపారు.

నేటి నుంచి మల్కపేటలో

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు

కోనరావుపేట, ఏప్రిల్ 15 : కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలోని శ్రీరామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం నుంచి ధ్వజస్తంభ ఉత్సవాలను నిర్వహి చనున్నట్లు మాజీ సర్పంచ్ ఆరే లత మహేందర్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని కోరారు.

భూములను పరిశీలించిన ఆర్డీవో


భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 15 : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ మెడికల్ భవనాల నిర్మా ణాల కోసం తీసుకున్న భూము లకు సంబంధించిన రైతులకు ఊరట లభించింది. భూములు కోల్పోయిన రైతులకు పెద్దూర్ శివారులోనే మరోచోట వెయ్యి గజాల చొప్పన స్థలాన్ని ఇచ్చేం దుకు సోమవారం సిరిసిల్ల ఆర్డీవో రమేష్, రైతులతో కలిసి భూములను పరిశీ లించారు. రైతుల నుంచి భూములు సేకరించిన ప్రభుత్వం పరిహారం చెల్లించకుండా అదనపు భవవ నిర్మాణాలను ప్రారంభించింది. విషయం తెలుసుకున్న రైతులు పనులను అడ్డుకున్నారు. దీంతో కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాల మేరకు ఆర్డీవో రమేష్ పెద్దూర్ రైతులతో మాట్లాడారు. నిర్మాణాలను పరిశీలించడంతోపాటు రైతులకు అందించేందుకు ఇటీవల సర్వే చేసిన నాలుగు ఎకరాల భూమిని పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అందిస్తామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ షరీఫ్ మొయినుద్దీన్, సర్వేయర్ శ్రీనివాస్, కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, పెద్దూర్ సింగిల్ విండో చైర్మన్ జీల కిషన్‌యాదవ్, మాజీ సింగిల్ విండో చైర్మన్ ఉలిసే తిరుపతి, సలేంద్రి బాలరాజుయాదవ్ రైతులుపాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 15: పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జడ్పీటీసీ కార్యాలయంలో ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచులతో సోమవారం ఎన్నికల సమా యత్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగయ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ విజయానికి పాటు పడాలని పిలుపునిచ్చారు. జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎంపీటీసీ అనసూయ, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: బీఆర్ఎస్ కార్యకర్తలు గ్రామాల్లో సైనికుడిలా పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి, మహిళా అధ్యక్షురాలు గుగులోతు కళ, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా, నాయకులు శ్రీరాం నాయక్, సంతోష్, దినకర్, ప్రభాకర్, రవి, రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య

బీజేపీ శ్రేణుల ఇంటింటి ప్రచారం


ప్రచారం చేస్తున్న చెన్నమనేని వికాస్ రావు దీప దంపతులు

వేములవాడ, ఏప్రిల్ 15: అభివృద్ధి, సంక్షేమం, దేశ భద్రత కోసం వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకే ఓటు వేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ కోరారు. సోమవారం వేములవాడ పట్టణం లోని పలు బూత్‌ల పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వచ్చే నెల జరగనున్న ఎన్నికలలో కమ లం గుర్తుపై ఓటు వేసి బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్‌ను గెలిపించాలని కోరారు. బీజేపీకి మద్దతు ఇవ్వడం ద్వారా నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానిని చేసుకుందామన్నారు.

కోనరావుపేట: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేస్తే పిల్లల భవిష్యత్ బాగుంటుందని ఆ పార్టీ నేత చెన్నమనేని వికాస్‌రావు దీప దంపతులు అన్నారు. కోనరావుపేట మండలం నాగారంలో సోమవారం ఇంటింటా ప్రచారాన్ని కొనసాగించారు. కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బండి సంజయ్‌ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. పార్టీ జిల్లా నాయకులు గోపాడి సురేందర్ రావు, మండల అధ్యక్షుడు రామచంద్రం, నాయకులు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల పట్టణంలోని అనంతనగర్, అశోక్‌నగర్‌లో బీజేపీ వార్డు కమి టీల ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్ పార్లమెంటరీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపీ, బూత్ అధ్యక్షులు రేణుక , వంశీ, రమేష్ పాల్గొన్నారు.

వీర్నపల్లి: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలని ఆ పార్టీ నాయకులు సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

ఇల్లంతకుంట: పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరుతూ మండలంలోని పలు గ్రా మాలలో సోమవారం ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రావణ్, మహే ష్,అనీల్, సంపత్,మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

చందుర్తి : చందుర్తిలో సోమవారం బీజేపీ నాయ కులు ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, మండల అధ్య క్షుడు పోంచెట్టి రాకేష్, నాయకులు తిరుపతి, శేఖర్, రమేష్, మెంగని శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోనరావుపేట : కోనరావుపేట మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలపై మండల కేంద్రంలో బీజేపీ నాయకులు అవగాహన కల్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు రామచంద్రం నాయకులు గోపాడి సురేందర్ రావు, మోత్కు మోహన్, జింక వెంకటి పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో బిజెపి ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ మద్దతుగా ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు రవీందర్, రవీందర్, పల్లి నితిన్, వసంత్ పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న ప్రతాప రామకృష్ణ

కాంగ్రెస్ పార్టీతోనే పేదల అభ్యున్నతి

కథలాపూర్, ఏప్రిల్ 15: పేదల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని తాండ్ర్యాల మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు గడీల గంగ ప్రసాద్, తుర్తి మాజీ సర్పంచ్ మట్కం గంగభూమయ్య సహా పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గతంలో ఉచిత కరెంట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేని మళ్లీ 200 యూనిట్లకు ఉచితంగా విద్యు త్ అందిస్తున్నామన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ఆనాడు కాంగ్రెస్ పాలన లోనే ఇచ్చామని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి న్యాయం చేసింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. సూరమ్మ చెరువున రిజర్వా యర్‌గా మార్చుతాని గతంలో బీ ఆర్ఎస్ ప్రభుత్వం నమ్మి ంచి మోసం చేసిందని అందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వ ర్యంలో అనేక నిరసనలు చేసినా చలనం లేకుండా పోయిం దన్నారు. పీసీసీ అధ్య క్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి కూడా సూరమ్మను పరిశీలించారని మొదటి ప్రాధా న్యం కింద పనులు పూర్తి చేయిస్తామన్నారు. ప్రస్తుత ఎంపీ బండి సంజయ్‌కు మార్ ఏనాడైనా సూరమ్మ చెరువు గురించి మాట్లాడారా అని ప్రశ్నించారు. నరేం ద్రమోదీ జన్ ధన్ ఖాతాలో ధన్‌మని రు. 15 లక్షలు వేస్తామని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నమ్మించి నయవంచన చేశారన్నారు.